# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण

EXTRAORDINARY

అసాధరణ

**भाग XVI अनुभाग 1**

**Part XVI Section 1**

**భాగము XVI అనుభాగము 1**

**प्राधिकरण द्वारा प्रकाशित**

**PUBLISHED BY AUTHORITY**

ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | | |
|---|---|---|---|---|---|
| सं १<br>**No.1**<br>సంఖ్య 1 | नई दिल्ली<br>**New Delhi**<br>న్యూఢిల్లీ | गुरूवार<br>**Thursday**<br>గురువారం | १२ दिसंबर, २०१९<br>**12 December, 2019/20**<br>12 డిసెంబర్, 2019/20 | मार्गशीरा<br>**Margashira**<br>మార్గశిర | खंड<br>**Vol. 11**<br>సంపుటము.1 |


MINISTRY OF LAW AND JUSTICE

(LEGISLATIVE DEPARTMENT)

New Delhi, th November, 2019

The Translation in Telugu of the following Acts namely:-

(1) The Petroleum and Minerals Pipelines (Acquisition of Right of User in Land) Act, 1962 (50 of 1962), (2) The National Food Security Act, 2013 (20 of 2013) are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Text thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Text (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

# శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ

## (శాసన నిర్మాణ విభాగము)

ఈ క్రింది చట్టములు, అనగా,

(1) పెట్రోలియం మరియు ఖనిజముల పైపులైనుల (భూ వినియోగదారుల హక్కును ఆర్జించు) చట్టము, 1962 (1962లోని 50వ చట్టము), (2) జాతీయ ఆహార భద్రత చట్టము, 2013 (2013లోని 20వ చట్టము) యొక్క తెలుగు అనువాదమును రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదమును ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము, 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఎ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# జాతీయ ఆహార భద్రత చట్టము, 2013
## (2013లోని 20వ చట్టము)

(10 సెప్టెంబరు, 2013)

ప్రజలు గౌరవంగా జీవించడానికై అందుబాటైన ధరలతో తగినంత పరిమాణంలో నాణ్యత గల ఆహారమును అందుబాటులో ఉండేటట్టు చూసేందుకు, మానవ జీవిత చక్రమును సాగించుటకైన పోషకాహార భద్రతను కల్పించేందుకు మరియు అందుకు సంబంధించిన లేదా దాని అనుషంగికమైన విషయములను నిబంధించుటకైన చట్టము.

భారత గణరాజ్యపు అరవై నాలుగవ సంవత్సరములో పార్లమెంటు ఈ క్రింది విధముగా శాసనము చేసినది:-

సంగ్రహనామము మరియు ప్రారంభము.

1. (1) ఈ చట్టమును జాతీయ ఆహార భద్రతా చట్టము, 2013 అని పేర్కొనవచ్చును.

(2) ఇది యావద్భారత దేశమునకు విస్తరించును.

(3) ఇతర విధముగా నిబంధించబడిననే తప్ప, ఈ చట్టము 2013 జూలై 5వ తేదీన అమలులోనికి వచ్చునట్లుగా భావించవలెను.

నిర్వచనములు.

2. ఈ చట్టములో సందర్భమును బట్టి అర్థము వేరుగా నున్ననే తప్ప,-

(1) "అంగన్‌వాడి" అనగా 4వ పరిచ్ఛేదము, 5వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (1)లోని ఖండము (ఎ) మరియు 6వ పరిచ్ఛేదము క్రిందికి వచ్చు సేవలను అందించుటకై కేంద్ర ప్రభుత్వపు సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకము క్రింద ఏర్పాటు చేయబడిన శిశు సంరక్షణ మరియు అభివృద్ధి కేంద్రము అని అర్థము;

(2) "కేంద్ర నిల్వలు (సెంట్రల్ పూల్)" అనగా,-

(i) కనీస మద్దతు ధర నిర్వహణల ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వములచే సేకరించబడిన;

(ii) విపత్తు ఉపశమనముతో సహా లక్షిత ప్రజాపంపిణీ విధానము, ఇతర సంక్షేమ పథకములు మరియు అట్టి ఇతర పథకముల క్రింద కేటాయింపుల నిమిత్తం నిర్వహించబడు;

(iii) ఉప-ఖండము (ii)లో నిర్దేశించిన పథకముల కొరకు సేకరించి ఉంచబడిన ఆహారధాన్యముల నిలువ అని అర్థము;

(3) "అర్హత కలిగిన కుటుంబములు" అనగా ప్రాధాన్య కుటుంబములు మరియు 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (i)లో నిర్దేశించబడిన అంత్యోదయ అన్న యోజన క్రిందికి వచ్చునటువంటి కుటుంబములు అని అర్థము;

(4) "చౌక ధరల దుకాణం" అనగా నిత్యావసర సరుకుల చట్టము, 1955లోని 3వ పరిచ్ఛేదము క్రింద జారీ అయిన ఉత్తర్వు ద్వారా లక్షిత పంపిణీ విధానము క్రింద రేషను కార్డు దారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయుటకై లైసెన్సు పొందిన దుకాణము అని అర్థము; 1955లోని 10వ చట్టము.

(5) "ఆహార ధాన్యములు" అనగా బియ్యం, గోధుమలు లేదా ముతక ధాన్యములు లేదా కేంద్ర ప్రభుత్వంచే ఉత్తరువు ద్వారా అయా సమయములందు నిర్ధారించబడునట్టి నాణ్యతా ప్రమాణములకు అనుగుణమైనటువంటి ఏదైనా మిశ్రమము అని అర్థము;

(6) "ఆహార భద్రత" అనగా అధ్యాయము-2 క్రింద నిర్దిష్ట పరచిన పరిమాణార్హత గల ఆహార ధాన్యములను మరియు భోజనమును సరఫరా చేయుట అని అర్థము.

(7) "ఆహార భద్రతా భత్యము" అనగా 8వ పరిచ్ఛేదము క్రింద హక్కు కలిగిన వ్యక్తులకు సంబంధిత రాష్ట్ర ప్రభుత్వముచే చెల్లించబడు డబ్బు మొత్తము అని అర్థము;

(8) "స్థానిక ప్రాధికార సంస్థ" అను పదపరిధిలో పంచాయతీ, పురపాలిక, జిల్లా బోర్డు, కంటోన్మెంట్ బోర్డు, పట్టణ ప్రణాళికా ప్రాధికార సంస్థ చేరి ఉండును మరియు పంచాయతీలు లేనటువంటి అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్ మరియు త్రిపుర రాజ్యములలో, సంవిధానము లేక స్వపరిపాలన కొరకు తత్సమయమున అమలులో నున్న ఏదైనా శాసనము క్రింద ప్రాధికారమొసగబడినటు వంటి, అది ఏ పేరుతో పిలువబడినప్పటికినీ గ్రామ పరిషత్తు లేదా కమిటీ లేదా ఏదైనా ఇతర నికాయము లేదా నిర్దిష్ట పరిచిన స్థానిక ప్రాంతము లోపల పౌర సేవల నియంత్రణ మరియు నిర్వహణలు నిహితమై ఉన్న నికాయము ఉండును;

(9) "భోజనము" అనగా కేంద్ర ప్రభుత్వము విహితపరచునట్లుగా వేడిగా వండిన లేదా ముందే వండి మరియు అందించుటకు ముందుగా వేడి చేసిన భోజనము లేదా ఇంటికి తీసుకొనిపోవు రేషను అని అర్థము;

(10) "కనీస మద్ధతు ధర" అనగా కేంద్ర నిల్వల కొరకు కేంద్ర ప్రభుత్వం మరియు రాష్ట్ర ప్రభుత్వములు మరియు వాటి ఏజెన్సీలచే రైతుల నుండి సేకరించిన ఆహార ధాన్యాలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నిశ్చిత ధర అని అర్థము;

(11) "అధిసూచన" అనగా ఈ చట్టము క్రింద జారీ చేయబడిన మరియు అధికార రాజపత్రములో ప్రచురించబడిన అధిసూచన అని అర్థము;

(12) "ఇతర సంక్షేమ పథకములు" అనగా పథకములలో భాగముగా ఆహార ధాన్యములను లేదా భోజనమును సరఫరా చేయుటకైన లక్షిత ప్రజా పంపిణీ విధానమునకు అదనమైనటువంటి ప్రభుత్వ పథకములు అని అర్థము;

(13) "అశక్తుడైన వ్యక్తి" అనగా అశక్తులైన వ్యక్తుల (సమాన అవకాశములు, హక్కుల పరిరక్షణ మరియు పూర్తిగా పాల్గొను) చట్టము, 1995లోని రెండవ పరిచ్ఛేదపు ఖండము (టి) క్రింద నిర్వచించబడినట్టి వ్యక్తి అని అర్థము; 1996లోని 1వచట్టము.

(14) "ప్రాధాన్య కుటుంబములు" అనగా 10వ పరిచ్ఛేదము క్రింద అట్లు గుర్తించబడినట్టి కుటుంబములు అని అర్థము;

(15) "విహిత" అనగా ఈ చట్టము క్రింద చేయబడిన నియమములచే విహిత పరచబడిన అని అర్థము;

(16) "రేషను కార్డు" అనగా లక్షిత ప్రజా పంపిణీ విధానము క్రింద చౌక ధరల దుకాణముల నుండి నిత్యావసర సరుకులను కొనుగోలు చేయు నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వ ఉత్తరువు లేదా ప్రాధికారం క్రింద జారీ చేయబడిన పత్రము అని అర్థము;

(17) "గ్రామీణ ప్రాంతము" అనగా తత్సమయమున అమలులో వున్న ఏదైనా శాసనము క్రింద స్థాపించబడిన లేదా ఏర్పాటు చేయబడిన ఏదైనా పట్టణ స్థానిక నికాయము లేదా కంటోన్మెంటు బోర్డు క్రిందికి వచ్చునట్టి ప్రాంతములు మినహా, రాజ్యంలోని ఏదైనా ప్రాంతము అని అర్థము;

(18) "అనుసూచి" అనగా ఈ చట్టమునకు అనుబంధించిన అనుసూచి అని అర్థము;

(19) "వయోవృద్ధ పౌరుడు" అనగా తల్లిదండ్రుల మరియు వయో వృద్ధ పౌరుల భరణ పోషణ మరియు సంక్షేమ చట్టము, 2007లోని 2వ పరిచ్ఛేదపు ఖండము (హెచ్) క్రింద నిర్వహించబడినట్టి వ్యక్తి అని అర్థము; 2007లోని 56వ చట్టము.

(20) "సామాజిక ఆడిటు" అనగా కార్యక్రమము లేదా పథకపు ప్రణాళిక మరియు అమలును ప్రజలు సమిష్టిగా పర్యవేక్షించు మరియు మదింపు చేయు ప్రక్రియ అని అర్థము;

(21) "రాజ్య కమీషను" అనగా 16వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన రాజ్య ఆహార కమీషను అని అర్థము;

(22) ఒక సంఘ రాజ్య క్షేత్రమునకు సంబంధించి "రాజ్య ప్రభుత్వము" అనగా సంవిధానపు 239వ అనుచ్ఛేదము క్రింద నియమించబడిన పరిపాలకుడు అని అర్థము;

(23) "లక్షిత ప్రజా పంపిణీ విధానము" అనగా చౌక ధరల దుకాణముల ద్వారా రేషను కార్డు దారులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేయు విధానము అని అర్థము;

(24) "నిఘా కమిటీ" అనగా ఈ చట్టము క్రింద అన్ని పథకముల అమలును పర్యవేక్షించుటకై 29వ పరిచ్ఛేదము క్రింద ఏర్పాటు చేయబడిన ఒక కమిటీ అని అర్థము;

(25) ఇందులో నిర్వచించబడని అయితే నిత్యావసర సరుకుల చట్టము, 1955 లేదా ఏదైనా సంబంధిత ఇతర చట్టములో నిర్వచించబడిన పదములు మరియు పదబంధములు, వాటికి ఆ చట్టములలో వరుసగా ఇవ్వబడిన అర్థమునే కలిగి ఉండును.

## అధ్యాయము - 2

## ఆహార భద్రతకైన నిబంధనలు

లక్షిత ప్రజా పంపిణీ చట్టము క్రింద అర్హత గల కుటుంబాలకు చెందిన వ్యక్తులు సబ్సిడీ ధరలలో ఆహార ధాన్యములను స్వీకరించుటకు గల హక్కు

3. (1) 10వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (1) క్రింద గుర్తించ బడిన ప్రాధాన్య కుటుంబాలకు చెందిన ప్రతి వ్యక్తి, లక్షిత ప్రజా పంపిణీ విధానము క్రింద రాజ్య ప్రభుత్వము నుండి అనుసూచి-1లో నిర్దిష్టపరచిన రాయితీ (సబ్సిడి) ధరలలో ఒక వ్యక్తికి మాసమునకు ఐదు కిలో గ్రాముల చొప్పున ఆహార ధాన్యములను స్వీకరించుటకు హక్కు కలిగి వుండును:

అయితే, అంత్యోదయ అన్న యోజన క్రిందికి వచ్చు కుటుంబాలు, కేంద్ర ప్రభుత్వముచే సదరు పథకంలో ప్రతి రాజ్యం కొరకు నిర్దిష్టపరచబడినట్టి మేరకు, అనుసూచి-1లో నిర్దిష్టపరచబడిన రేట్ల వంతున ఒక్కొక్క మాసమునకు ఒక్కొక్క కుటుంబానికి ముప్పై ఐదు కిలో గ్రాముల ఆహార ధాన్యములను పొందుటకు హక్కు కలిగి ఉండును:

అయితే ఇంకనూ, ఈ చట్టము క్రింద ఏదైనా రాజ్యమునకు ఆహార ధాన్యాల వార్షిక కేటాయింపు, సాధారణ లక్షిత ప్రజా పంపిణీ విధానము క్రింద గత మూడు సంవత్సరముల కొనుబడి మొత్తమునకైన ఆహార ధాన్యముల వార్షిక సగటు కంటే తక్కువగా ఉన్న యెడల, కేంద్ర ప్రభుత్వముచే నిర్ణయించబడినట్టి ధరలకు దానిని ఆదరించవలెను మరియు అనుసూచి-4లో నిర్దిష్టపరచబడినట్టి ఆహార ధాన్యములను రాజ్యమునకు కేటాయించవలెను.

**విశదీకరణ:-** ఈ పరిచ్ఛేదము నిమిత్తము "అంత్యోదయ అన్న యోజన" అనగా 25 డిసెంబరు, 2000వ తేదీన కేంద్ర ప్రభుత్వము సదరు పేరు మీద ప్రారంభించిన మరియు ఆయా సమయములందు మార్పు చేయబడినట్టి పథకము అని అర్థము.

(2) రాయితీ (సబ్సిడీ) ధరల వంతున ఉప-పరిచ్ఛేదము (1)లో నిర్దేశించబడిన అర్హత గల కుటుంబాలకు చెందిన వ్యక్తుల హక్కులను గ్రామీణ జనాభాకు డెబ్బై ఐదు శాతం వరకు మరియు పట్టణ జనాభాకు యాభై శాతం వరకు విస్తరింపజేయవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము (1)కి లోబడి, కేంద్ర ప్రభుత్వము నిర్దిష్టపరచునట్టి మార్గదర్శక సూత్రములననుసరించి, అర్హత కల్గిన కుటుంబములకు చెందిన వ్యక్తులకు, రాజ్య ప్రభుత్వము, పరిమాణార్హత గల ఆహార ధాన్యములకు బదులుగా గోధుమ పిండిని సమకూర్చువచ్చును.

గర్భిణీ స్త్రీలకు మరియు పాలిచ్చే తల్లులకు పోషకాహార మద్దతు.

4. కేంద్ర ప్రభుత్వము రూపొందించినట్టి పథకములకు అధ్యధీనమై ప్రతి గర్భిణీ స్త్రీ మరియు పాలిచ్చే తల్లి ఈ క్రింది వాటిని పొందుటకు హక్కు కల్గి ఉందురు.

(ఏ) అనుసూచి-2లో నిర్దిష్టపరచిన పోషకాహార ప్రమాణాలను తీర్చుటకు వీలుగా గర్భిణీగా ఉన్నప్పుడు మరియు శిశివు జన్మించిన తరువాత ఆరుమాసముల వరకు స్థానిక అంగన్‌వాడీల ద్వారా ఖర్చు లేకుండా భోజనం; మరియు

(బి) కేంద్ర ప్రభుత్వం విహితపరచునట్టి వాయిదాలలో, ఆరు వేల రూపాయలకు తక్కువ కానట్టి ప్రసూతి ప్రయోజనం:

అయితే, కేంద్ర ప్రభుత్వం లేదా రాజ్య ప్రభుత్వములు లేదా ప్రభుత్వ రంగ అధీనబద్ధ సంస్థలలో నియతమైన (రెగ్యులర్) ఉద్యోగములోనున్న లేదా తత్సమయమున అమలులో ఉన్న ఏదైనా శాసనము క్రింద అదే రకమైన ప్రయోజనములను పొందుతున్న గర్భిణీ స్త్రీ లందరూ మరియు పాలిచ్చే తల్లులు, ఖండము (బి)లో నిర్దిష్టపరచిన ప్రయోజనములను పొందుటకు హక్కు కల్గి ఉండరు.

పిల్లలకు పోషకాహార మద్దతు.

5. (1) ఖండము (బి)లో ఉన్న నిబంధనలకు అధ్యధీనమై, పద్నాలుగు సంవత్సరముల వయస్సు వరకు ప్రతీ పిల్ల/పిల్లవాడు తన యొక్క పోషకాహార అవసరాల నిమిత్తం ఈ క్రింది హక్కులను కల్గి ఉందురు, అవేవనగా:-

(ఏ) ఆరు మాసముల నుండి ఆరు సంవత్సరముల వయో వర్గంలోని పిల్లల విషయంలో, అనుసూచి-2లో నిర్దిష్టపరచిన పోషకాహార ప్రమాణములను తీర్చుటకు వీలుగా స్థానిక అంగన్‌వాడి ద్వారా ఖర్చు లేకుండా వయస్సుకు తగిన భోజనం:

అయితే ఆరు మాసముల వయస్సు లోపు పిల్లలకు ప్రత్యేకించి తల్లి పాలు ఇవ్వవలెను;

(బి) ఎనిమిదవ తరగతి వరకు లేదా ఆరు సంవత్సరముల నుండి పద్నాలుగు సంవత్సరముల వయో వర్గంలోపల, ఈ రెండింటిలో ఏది వర్తించునో ఆ పిల్లల విషయంలో అనుసూచి-2లో నిర్ధిష్టపరచిన పోషకాహార ప్రమాణములను తీర్చుటకు వీలుగా, స్థానిక నికాయములు నడుపుతున్న అన్ని పాఠశాలలలోను, ప్రభుత్వ మరియు ప్రభుత్వ సహాయం పొందుతున్న పాఠశాలలలోను పాఠశాల సెలవు దినములలో మినహా, ప్రతి రోజు ఖర్చు లేనటువంటి ఒక మధ్యాహ్న భోజనము.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (బి)లో నిర్దేశించిన ప్రతి పాఠశాల మరియు అంగన్‌వాడీలలో భోజనం వండుటకు, త్రాగునీరు మరియు పారిశుధ్య సదుపాయములను కలిగి ఉండవలెను:

అయితే పట్టణ ప్రాంతములలో, కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శక సూత్రముల ప్రకారం అవసరమగు చోట్ల భోజనం వండుటకు కేంద్రీకృత వంటశాలల సదుపాయములను ఉపయోగించ వచ్చును.

6. అనుసూచి-2లో నిర్ధిష్టపరచిన పోషకాహార ప్రమాణములను తీర్చడానికి వీలుగా రాజ్య ప్రభుత్వం, స్థానిక అంగన్ వాడీ ద్వారా, పోషకాహార లోపంతో బాధపడుతున్న పిల్లలను గుర్తించి మరియు ఖర్చు లేనటువంటి భోజనములను సమకూర్చవలెను. శిశు పోషకాహార లోపమును నివారించుట మరియు నిర్వహించుట.

7. కేంద్ర ప్రభుత్వముచే విహిత పరచబడినట్టి రీతిలో కేంద్ర ప్రభుత్వము, రాజ్య ప్రభుత్వముల మధ్య వ్యయముల వాటాను పంచుకోవడంలో సహా, మార్గదర్శక సూత్రముల ననుసరించి 4, 5 మరియు 6వ పరిచ్ఛేదము క్రింద కల్గి ఉండు హక్కులకు వర్తించు పథకములను రాజ్య ప్రభుత్వములు అమలు చేయవలెను. హక్కులను నెరవేర్చు నిమిత్తం పథకములను అమలు చేయుట.

## అధ్యాయము-3
## ఆహార భద్రతా భత్యము.

కొన్ని సందర్భములలో ఆహార భద్రతా భత్యమును పొందుటకు హక్కు.

8. అధ్యాయము-2 క్రింద హక్కు కల్గిన వ్యక్తులకు అర్హతా పరిమాణాలు కలిగిన ఆహారధాన్యములను లేదా భోజనములను సరఫరా చేయని సందర్భములో, అట్టి వ్యక్తులు కేంద్ర ప్రభుత్వముచే విహిత పరచబడునట్టి సమయంలోపల మరియు రీతిలో ఒక్కొక్క వ్యక్తికి చెల్లించవలసిన ఆహార భద్రతా భత్యమును సంబంధిత రాజ్య ప్రభుత్వము నుండి పొందుటకు హక్కు కలిగి ఉండును.

## అధ్యాయము-4
## అర్హత గల కుటుంబములను గుర్తించుట

లక్షిత ప్రజా పంపిణీ విధానము క్రింద జనాభాకు వర్తింపజేయుట.

9. 3వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (2)కు అధ్యధీనమై, ప్రతి ఒక రాజ్యములోని గ్రామీణ మరియు పట్టణ ప్రాంతములలో లక్షిత ప్రజా పంపిణీ విధానము క్రిందికి వచ్చు శాతవారి వర్తింపును కేంద్ర ప్రభుత్వము నిర్ధారించవలెను మరియు రాజ్యము యొక్క గ్రామీణ మరియు పట్టణ ప్రాంతములలో వర్తింప చేయవలసిన వ్యక్తుల మొత్తము సంఖ్యను, సంబంధిత అంకెలు ప్రచురించబడిన జనగణన ప్రకారం జనాభా అంచనాల ప్రాతిపదికపై లెక్క కట్టవలెను.

రాజ్య ప్రభుత్వము మార్గదర్శక సూత్రములను తయారు చేయుట మరియు ప్రాధాన్య కుటుంబములను గుర్తించుట.

10. (1) గ్రామీణ మరియు పట్టణ ప్రాంతముల కొరకు 9వ పరిచ్ఛేదము క్రింద నిర్ధారించిన వ్యక్తుల సంఖ్య లోపల రాజ్య ప్రభుత్వము, ఈ క్రింది వాటిని గుర్తించవలెను,-

(ఎ) 3వ పరిచ్ఛేదము ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నిర్దిష్ట పరచినమేరకు అంత్యోదయ అన్న యోజన పథకమునకు వర్తింపజేయు మార్గదర్శక సూత్రముల ననుసరించి సదరు పథకము క్రిందికి వచ్చు కుటుంబములు;

(బి) రాజ్య ప్రభుత్వము నిర్దిష్టపరచునట్టి మార్గదర్శక సూత్రముల ననుసరించి లక్షిత ప్రజా పంపిణీ పథకపు వర్తింపు క్రిందికి వచ్చు ప్రాధాన్య కుటుంబములుగా మిగిలిన కుటుంబములు:

అయితే, రాజ్య ప్రభుత్వము, సాధ్యమైనంత త్వరగా, ఈ చట్టము ప్రారంభమైన తరువాత, మూడు వందల అరవై ఐదు దినములకు మించని కాలావధి లోపల, ఈ ఉప-పరిచ్ఛేదము క్రింద రూపొందించ బడిన మార్గదర్శక సూత్రముల ప్రకారం అర్హత గల కుటుంబములను గుర్తించవలెను:

అయితే ఇంకనూ రాజ్య ప్రభుత్వము, అట్టి కుటుంబముల గుర్తింపు పూర్తియ్యేంత వరకు, ప్రస్తుతమున్న లక్షిత ప్రజా పంపిణీ విధానము క్రింద కేంద్ర ప్రభుత్వము నుండి ఆహార ధాన్యముల కేటాయింపు పొందుటను కొనసాగించవలెను.

(2) రాజ్య ప్రభుత్వము, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద రూపొందించ బడిన మార్గదర్శక సూత్రముల ప్రకారం, గ్రామీణ మరియు పట్టణ ప్రాంతముల కొరకు 9వ పరిచ్ఛేదము క్రింద నిర్ధారించబడిన వ్యక్తుల సంఖ్య లోపల అర్హతగల కుటుంబముల జాబితా నవీకరించబడవలెను.

అర్హత గల కుటుంబముల జాబితాను ప్రచురించుట మరియు ప్రదర్శించుట.

11. రాజ్య ప్రభుత్వము, గుర్తించిన అర్హతగల కుటుంబముల జాబితాను సార్వజనిక పరిధిలో ఉంచవలెను మరియు దానిని అందరికి కనిపించే కూడలిలో ప్రదర్శించవలెను.

## అధ్యాయము- 5
## ప్రజా పంపిణీ విధానములో సంస్కరణలు.

లక్షిత ప్రజా పంపిణీ విధానములో సంస్కరణలు.

12. (1) ఈ చట్టములో లక్షిత ప్రజా పంపిణీ విధానమునకు ఒసగబడిన పాత్రతో మిళితమవుతూ, కేంద్ర మరియు రాజ్య ప్రభుత్వములు, వాటిలో అవసరమైన ప్రగతిశీల సంస్కరణలు తీసుకు వచ్చుటకు కృషి చేయవలెను.

(2) ఇతర విషయములతో పాటు, ఆ సంస్కరణలలో ఈ క్రిందివి చేరి యుండవలెను,–

(ఎ) లక్షిత ప్రజా పంపిణీ విధానపు దుకాణముల (అవుట్ లెట్లకు) గుమ్మం వద్దకు ఆహార ధాన్యాలను బట్వాడా చేయుట;

(బి) అన్ని స్థాయిలలోను లావాదేవీలను పారదర్శకంగా రికార్డు చేసేటట్లు మరియు మళ్ళింపును నివారించుటలో నిశ్చయ పరుచుటకు వీలుగా, సమగ్ర కంప్యూటరీకరణతో సహా సమాచార మరియు ప్రసార సాంకేతిక పరిజ్ఞాన సాధనములను ఉపయోగించుట;

(సి) ఈ చట్టము క్రింద సరియైన లక్షిత ప్రయోజనముల కొరకు హక్కు కల్గిన లబ్ధిదారుల బయోమెట్రిక్ సమాచారం (వ్యక్తిని గుర్తించు సాంకేతిక పరిజ్ఞానం)తో విశిష్ట గుర్తింపు నిమిత్తం "ఆధార్"ను ఉపయోగించుట;

(డి) రికార్డులను పూర్తిగా పారదర్శకంగా ఉంచుట;

(ఇ) మహిళలు లేదా వారి సముదాయములు చౌక ధర దుకాణములను నిర్వహించేందుకు మరియు వారికి చౌక ధర దుకాణములకు లైసెన్సు ఇచ్చుటలో పంచాయతీలు, స్వయం సహాయ బృందములు, సహకార సంఘములు వంటి పబ్లికు సంస్థలు లేదా పబ్లికు నికాయములకు ప్రాధాన్యతనిచ్చుట;

(ఎఫ్) కాలావధికి మించి ప్రజా పంపిణీ విధానం క్రింద పంపిణీ చేసిన సరకులను వివిధముగా మళ్లించుట;

(జి) స్థానిక ప్రజా పంపిణీ నమూనాలు మరియు ధాన్యా గారములకు మద్దతు నిచ్చుట;

(హెచ్) కేంద్ర ప్రభుత్వము విహిత పరచునట్టి ప్రాంతములో మరియు రీతిలో అధ్యాయము-2లో నిర్దిష్టపరచిన లక్షిత లబ్ధిదారులకు

వారి ఆహార ధాన్యముల హక్కు కల్గి ఉండుటకు వీలుగా నగదు బదిలీ, భోజన కూపన్లు లేదా ఇతర పథకముల వంటి పథకములను ప్రవేశ పెట్టుట.

## అధ్యాయము – 6
## మహిళా సాధికారత

రేషను కార్డులను జారీ చేయు నిమిత్తం పద్దెనిమిది సంవత్సరములు లేదా అంతకంటే ఎక్కువ వయస్సు గల మహిళలు కుటుంబ పెద్దగా ఉండుట.

13. (1) రేషను కార్డులను జారీ చేయు నిమిత్తం అర్హత గల ప్రతి కుటుంబములోను పద్దెనిమిది సంవత్సరముల వయస్సుకు తక్కువ కానట్టి జ్యేష్ఠ మహిళ కుటుంబ పెద్దగా ఉండును.

(2) రేషను కార్డు జారీ చేయు నిమిత్తం ఎప్పుడైనా కుటుంబములో పద్దెనిమిది సంవత్సరముల వయస్సు లేదా అంతకు మించిన వయస్సు గల మహిళ ఎవరూ లేని యెడల, అయితే, పద్దెనిమిది సంవత్సరముల వయస్సుకు లోపు గల మహిళా సభ్యురాలు ఉన్నపుడు, కుటుంబములో పెద్దవాడైన పురుష సభ్యుడు కుటుంబ పెద్దగా ఉండును మరియు మహిళా సభ్యురాలికి పద్దెనిమిది సంవత్సరముల వయస్సు వచ్చిన మీదట అట్టి రేషను కార్డుల నిమిత్తం అట్టి పురుష సభ్యుని స్థానంలో ఆమె కుటుంబ పెద్దగా ఉండును.

## అధ్యాయము – 7
## వ్యధల నివారణా యంత్రాంగం

అంతర్గత వ్యధల నివారణా యంత్రాంగం.

14. ప్రతి రాజ్య ప్రభుత్వము ఒక అంతర్గత వ్యధల నివారణ యంత్రాంగమును ఏర్పాటు చేయవలెను. ఇందులో కాల్ సెంటర్లు, హెల్ప్‌లైన్లు, నోడల్ అధికారుల పదాభిదానము లేదా విహిత పరచబడినట్టి ఇతర యంత్రాంగం చేరి ఉండును.

జిల్లా వ్యధల నివారణ అధికారి.

15. (1) రాజ్య ప్రభుత్వం, ఈ చట్టము క్రింద హక్కులను అమలు చేయుటకు మరియు అధ్యాయము–2 క్రింద హక్కు కల్గి ఉండిన ధాన్యములు లేదా భోజనములను పంపిణీ చేయుటకు సంబంధించిన విషయములలో

వ్యధితులైన వ్యక్తుల వ్యధలను త్వరిత గతిన మరియు సమర్ధవంతంగా నివారించుటకు, ప్రతి జిల్లాకు, జిల్లా వ్యధల నివారణ అధికారిగా ఒక అధికారిని నియమించవలెను లేదా పదాభిదానము చేయవలెను.

(2) జిల్లా వ్యధల నివారణ అధికారిగా నియమించుటకైన అర్హతలు మరియు వారి యొక్క అధికారములు రాజ్య ప్రభుత్వము విహిత పరచబడినట్లు ఉండవలెను.

(3) జిల్లా వ్యధల నివారణ అధికారి నియామకమునకైన పద్ధతి మరియు నిబంధనలు మరియు షరతులు రాజ్య ప్రభుత్వము విహితపరచునట్లు ఉండవలెను.

(4) రాజ్య ప్రభుత్వము, జిల్లా వ్యధల నివారణ అధికారి మరియు ఇతర సిబ్బంది యొక్క జీతభత్యములను మరియు దానిని తగిన విధంగా నిర్వర్తింప జేయుటకు అవసరమని భావించినట్టి ఇతర వ్యయమును సమకూర్చవలెను.

(5) ఉప-పరిచ్ఛేదములు (1)లో నిర్దేశించిన అధికారి, రాజ్య ప్రభుత్వము విహితపరచినట్టి రీతిలో మరియు అట్టి కాలవధి లోపల, హక్కు కల్గి ఉండిన ఆహార ధాన్యములు లేదా భోజనములను పంపిణీ చేయనందుకు సంబంధించిన ఫిర్యాదులను మరియు దానికి సంబంధించిన విషయములను ఆకర్ణించి మరియు వాటి నివారణ నిమిత్తం అవసరమగు చర్య తీసుకొనవలెను.

(6) ఉప-పరిచ్ఛేదము (1)లో నిర్దేశించిన అధికారిచే జారీ చేయబడిన ఉత్తరువు అది ఎవరిపై జారీ చేయబడినదో ఆ ఫిర్యాది లేక ఆ అధికారి లేక ప్రాధికార సంస్థ, అట్టి వ్యధ నివారణపై సంతృప్తి చెందని యెడల, అట్టి ఉత్తరువుపై రాజ్య కమీషను సమక్షములో అపీలును దాఖలు చేయవచ్చును.

(7) ఉప-పరిచ్ఛేదము (6) క్రింద ప్రతి అపీలును, రాజ్య ప్రభుత్వముచే విహిత పరచబడినట్టి రీతిలో మరియు అట్టి కాలావధి లోపల దాఖలు చేయవలెను.

16. (1) ఈ చట్టము అమలును పర్యవేక్షించుటకు మరియు పునర్విలోకనము చేయుటకు ప్రతి రాజ్య ప్రభుత్వము, అధిసూచన ద్వారా, ఒక రాజ్య ఆహార కమీషనును ఏర్పాటు చేయవలెను. రాజ్య ఆహార కమీషను.

(2) రాజ్య కమీషను ఈ క్రింది వారితో కూడి ఉండవలెను,-

(ఎ) ఒక ఛైర్‌పర్సను;

(బి) ఐదుగురు ఇతర సభ్యులు; మరియు

(సి) ఒక సభ్య-కార్యదర్శి, ఆయన ప్రభుత్వ సంయుక్త కార్యదర్శి హోదాకు తక్కువ కానట్టి రాజ్య ప్రభుత్వ అధికారి అయి ఉండవలెను:

అయితే, ఛైర్ పర్సన్, సభ్యుడు లేదా సభ్యకార్యదర్శులలో కనీసం ఇద్దరు మహిళలు ఉండవలెను:

అయితే ఇంకనూ ఛైరపర్సన్, సభ్యుడు లేదా సభ్య కార్యదర్శులలో అనుసూచిత కులములకు చెందిన ఒక వ్యక్తి మరియు అనుసూచిత జనజాతులకు చెందిన ఒక వ్యక్తి ఉండవలెను.

(3) ఛైర్‌పర్సన్ మరియు ఇతర సభ్యులు ఈ క్రింది వ్యక్తులలో నుండి నియమించబడవలెను.

(ఎ) ఆహార భద్రత, విధాన నిర్ణయము మరియు వ్యవసాయ, పౌర సరఫరాలు, పోషకాహారం, ఆరోగ్యము లేదా ఏదైనా అనుబంధరంగ పరిపాలనకు సంబంధించిన విషయములలో పరిజ్ఞానం మరియు అనుభవం కలిగి ఉండి, అఖిల భారత సర్వీసులు లేదా కేంద్ర లేదా రాజ్యమునకు చెందిన ఏదైనా ఇతర సివిలు సర్వీసులు లేదా కేంద్రం

లేదా రాజ్యం క్రింద సివిలు పదవిని కలిగి ఉన్న సభ్యునిగా ఉన్న లేక ఉండియున్న; లేదా

(బి) వ్యవసాయం, న్యాయశాస్త్రం, మానవ హక్కులు, సామాజిక సేవా, నిర్వహణ, పోషకాహారం, ఆరోగ్యం, ఆహార విధానం లేదా ప్రజా పరిపాలనలో విస్తృతమైన పరిజ్ఞానం మరియు అనుభవం కలిగి వుండి ప్రజా జీవనంలో ఘనత వహించిన వ్యక్తి; లేదా

(సి) ఆహారం మరియు పేదల పోషకాహార హక్కుల అభివృద్ధికి సంబంధించిన పనిలో నిరూపితమైన రికార్డు వున్న వ్యక్తి.

(4) ఛైర్‌పర్సన్ మరియు ప్రతి ఇతర సభ్యుడు, తాను పదవిలో చేరిన తేదీ నుండి ఐదు సంవత్సరముల కాలావధికి మించకుండా పదవిలో ఉండును మరియు పునర్నియామకమునకు అర్హత కలిగి ఉండును:

అయితే, ఏ వ్యక్తైనా, ఆయనకు అరవై ఐదు సంవత్సరములు వయస్సు వచ్చిన తరువాత ఛైర్‌పర్సన్ లేదా ఇతర సభ్యునిగా పదవిలో ఉండరాదు.

(5) రాజ్య కమీషను ఛైరపర్సన్, ఇతర సభ్యులు మరియు సభ్య కార్యదర్శి నియామక పద్ధతి మరియు ఇతర నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆయన నియామకము, రాజ్య కమీషను యొక్క సమావేశములకైన (కోరముతో సహా అట్టి సమావేశములు) సమయము, స్థలము, ప్రక్రియ మరియు దాని అధికారములు, రాజ్య ప్రభుత్వముచే విహిత పరచునట్లుండ వలెను.

(6) రాజ్య కమీషను ఈ క్రింది కృత్యములను చేపట్టవలెను, అవేవనగా:-

(ఎ) రాజ్యమునకు సంబంధించి ఈ చట్టపు అమలును పర్య వేక్షించుట మరియు మూల్య నిర్ధారణ చేయుట;

(బి) తనంతట తానుగా లేదా ఫిర్యాదు అందిన మీదట అధ్యాయము-2 క్రింద నిబంధించిన హక్కుల ఉల్లంఘనలపై విచారణ జరుపుట;

(సి) ఈ చట్టమును కట్టుదిట్టముగా అమలు చేయుటకై రాజ్య ప్రభుత్వమునకు సలహా నిచ్చుట;

(డి) ఈ చట్టములో నిర్దిష్టపరచిన వైయక్తికుల హక్కులను వారికి పూర్తిగా అందుబాటులో ఉంచుటకు వీలుగా, ఆహార మరియు పోషకాహార సంబంధిత పథకములను సమర్థవంతంగా అమలు పరచుటకై రాజ్య ప్రభుత్వమునకు, దాని ఏజన్సీలకు, స్వయం ప్రతిపత్తి గల నికాయములకు, అదేవిధముగా సంబంధిత సర్వీసులను అందించడంలో నిమగ్నమై ఉన్న ప్రభుత్వేతర వ్యవస్థలకు సలహా నిచ్చుట;

(ఇ) జిల్లా వ్యథల నివారణ అధికారి ఉత్తరువులపై అపీళ్ళను ఆకర్ణించుట;

(ఎఫ్) రాజ్య ప్రభుత్వముచే రాజ్య శాసన మండలి సమక్షంలో ఉంచబడు వార్షిక నివేదికలను తయారు చేయుట.

(7) రాజ్య కమీషను తగిన విధంగా పని చేయుట కొరకు తాను అవసరమని భావించునట్టి పరిపాలనా మరియు సాంకేతిక సిబ్బందిని రాజ్య కమీషనుకు రాజ్య ప్రభుత్వము అందుబాటులో ఉంచవలెను.

(8) ఉప-పరిచ్ఛేదము (7) క్రింద సిబ్బంది నియామకపు పద్ధతి, వారి జీతనులు, భత్యములు మరియు సేవా షరతులు రాజ్య ప్రభుత్వము విహితపరచునట్లు ఉండవలెను.

(9) రాజ్య ప్రభుత్వము,-

(ఎ) దివాలా దారుగా న్యాయ నిర్ణయము చేయబడిన లేదా ఎప్పుడైనను చేసి ఉండిన; లేక

(బి) సభ్యుడుగా వ్యవహరించుటకు శారీరకముగా లేక మానసికముగాను అశక్తుడైన; లేక

(సి) రాజ్య ప్రభుత్వ అభిప్రాయములో నీతి బాహ్యతతో కూడిన అపరాధమునకు దోషస్థాపితుడైన; లేక

(డి) సభ్యునిగా తన కృత్యములకు భంగకరము కలుగునట్లుగా ఆర్థిక పరమైన లేక ఇతర హితమును ఆర్జించిన; లేక

(ఇ) అతనిని పదవి యందు కొనసాగించుట ప్రజా హితమునకు హానికరమగునట్లు తన పదవిని దురుపయోగము చేసిన;

ఛైర్‌పర్సన్ లేదా ఎవరైనా సభ్యుడిని పదవి నుండి తొలగించవచ్చును.

(10) ఈ విషయములో విన్నవించుకొనుటకు అతనికి సబబైన అవకాశము ఇచ్చిననే తప్ప, ఉప-పరిచ్ఛేదము (9)లోని ఖండము (డి) లేదా ఖండము (ఇ) క్రింద అట్టి ఛైర్ పర్సన్ మరియు సభ్యుడిని తొలగించరాదు.

రాజ్య కమీషను ఛైర్ పర్సన్, సభ్యుడు, సభ్య కార్యదర్శి మరియు ఇతర సిబ్బంది జీతము మరియు భత్యములు.

17. రాజ్య కమీషను తగువిధముగా పని చేయుటకై ఛైర్‌పర్సన్, ఇతర సభ్యులు, సభ్య కార్యదర్శి, సహాయక సిబ్బందికైన జీతము మరియు భత్యములను మరియు అవసరమగు ఇతర పరిపాలనా ఖర్చులను రాజ్య ప్రభుత్వం సమకూర్చవలెను.

రాజ్య కమీషనుగా కృత్యము నిర్వర్తించుటకు ఏదైనా కమీషను లేదా నికాయము యొక్క హోదా.

18. రాజ్య ప్రభుత్వము, అవసరమని భావించినచో, 16వ పరిచ్ఛేదములో నిర్దేశించిన రాజ్య కమీషను యొక్క అధికారములను వినియోగించుటకు మరియు కృత్యములను నిర్వర్తించుటకు, అధిసూచన ద్వారా ఏదైనా శాసన పరమైన కమీషన్‌ను లేదా నికాయమును పదాభిదానము చేయవచ్చును.

19. 16వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికిని, ఈ చట్టము నిమిత్తము, కేంద్ర ప్రభుత్వ ఆమోదముతో రెండు లేదా అంతకు మించిన రాజ్యములకు ఒక సంయుక్త రాజ్య ఆహార కమీషను ఉండవచ్చును. సంయుక్త రాజ్య ఆహార కమీషను.

20. (1) 16వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (6)లోని ఖండములు (బి) మరియు (ఇ)లో నిర్దేశించిన ఏదైనా విషయములో విచారణ జరుపునపుడు మరియు ప్రత్యేకముగా ఈ క్రింది విషయములకు సంబంధించి, రాజ్య కమీషనుకు, సివిలు ప్రక్రియా స్మృతి, 1908 క్రింద దావాను విచారణ చేయునపుడు సివిలు న్యాయ స్థానమునకు ఉన్నటువంటి అధికారములు ఉండును, అవేవనగా:- పరిశీలనకు సంబంధించిన అధికారములు. 1908లోని 5వ చట్టము.

(ఎ) ఎవరైనా వ్యక్తిని సమను చేయుట మరియు హాజరగునట్లు చేయుట మరియు అతని చేత ప్రమాణము చేయించి పరీక్షించుట;

(బి) ఏదైనా దస్తావేజును వెల్లడి చేయుట మరియు దానిని దాఖలు పరచుట;

(సి) ప్రమాణ పత్రముపై సాక్ష్యము స్వీకరించుట;

(డి) ఏదైనా పబ్లికు రికార్డును లేదా దాని ప్రతిని పంపవలసిందిగా ఏదైనా న్యాయస్థానమును లేదా కార్యాలయమును అభ్యర్థించుట; మరియు

(ఇ) సాక్ష్యులను లేదా దస్తావేజులను పరీక్షించుటకు కమీషనులను జారీ చేయుట.

(2) సంబంధించిన ఏదైనా కేసును విచారించుటకై అధికారితా పరిధి గల మెజిస్ట్రేటుకు ఆ కేసును విచారణకై పంపుటకు రాజ్య కమీషనుకు అధికారముండును మరియు మెజిస్ట్రేటు, తనకు పంపించినట్టి ఏదైనా కేసును క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1973లోని 346వ పరిచ్ఛేదము క్రింద తనకు 1974లోని 2వ చట్టము.

పంపించినట్టి కేసుగానే భావించి, నిందితునిపై ఫిర్యాదును విచారించుటకు ఉపక్రమించవలెను.

రాజ్య కమీషనులో ఖాళీలు మొదలగునవి ఉండుటవలన దాని కార్యకలాపములు శాసన మాన్యతను కోల్పోకుండుట.

21. రాజ్య కమీషను యొక్క ఏ చర్య లేదా కార్యకలాపము, కేవలం ఈ క్రింది కారణంపై మాత్రమే,-

(ఎ) రాజ్య కమీషను ఏర్పాటులోని ఏదైనా లోపము లేదా ఏదైనా ఖాళీ ఉన్నదనే కారణంపై; లేదా

(బి) రాజ్య కమీషను యొక్క ఛైర్‌పర్సను లేదా ఒక సభ్యుడిగా ఒక వ్యక్తిని నియమించడంలో ఏదైనా లోపము ఉన్నదనే కారణంపై;

(సి) కేసు యోగ్యతలకు భంగము కలుగకుండ రాజ్య కమీషను ప్రక్రియలో ఏదైనా క్రమ రాహిత్యం వలన, శాసన మాన్యతను కోల్పోరాదు.

## అధ్యాయము – 8
## ఆహార భద్రతకు కేంద్ర ప్రభుత్వ బాధ్యతలు.

కేంద్ర ప్రభుత్వం ఆహార ధాన్యములను అవసరమగు పరిమాణంలో కేంద్ర నిల్వల నుండి రాజ్య ప్రభుత్వములకు కేటాయింపు చేయుట.

22. (1) కేంద్ర ప్రభుత్వము, 3వ పరిచ్ఛేదము క్రింద హక్కుల ప్రకారం, అర్హత గల కుటుంబాలకు చెందిన వ్యక్తులకు క్రమ బద్ధంగా ఆహార ధాన్యముల సరఫరా జరుగునట్లుగా చూసేందుకు, లక్షిత ప్రజా పంపిణీ విధానం క్రింద రాజ్య ప్రభుత్వములకు అవసరమైన మరియు పరిమాణములో మరియు అనుసూచి-1లో నిర్దిష్టపరచిన ధరలలో, కేంద్ర నిల్వల నుండి ఆహార ధాన్యములను కేటాయించవలెను.

(2) కేంద్ర ప్రభుత్వం, 10వ పరిచ్ఛేదం క్రింద ప్రతి రాజ్యములో గుర్తించిన అర్హత గల కుటుంబములకు చెందిన వ్యక్తుల సంఖ్య ననుసరించి ఆహార ధాన్యములను కేటాయించవలెను.

(3) కేంద్ర ప్రభుత్వము, 4, 5 మరియు 6 పరిచ్ఛేదముల క్రింద హక్కులకు సంబంధించి, రాజ్య ప్రభుత్వాలకు అనుసూచి-1లో నిర్దిష్టపరచబడిన ధరలలో అర్హతగల కుటుంబాలకు చెందిన వ్యక్తుల కొరకు ఆహార ధాన్యములను సమకూర్చవలెను.

(4) ఉప-పరిచ్ఛేదము (1)కి భంగము కలుగకుండా, కేంద్ర ప్రభుత్వం,-

(ఎ) తన స్వంత ఏజెన్సీలు మరియు రాజ్య ప్రభుత్వములు మరియు వాటి ఏజెన్సీల ద్వారా కేంద్ర నిల్వల కొరకైన ఆహార ధాన్యములను సేకరించవలెను;

(బి) రాజ్యములకు ఆహార ధాన్యములను కేటాయించవలెను;

(సి) కేటాయింపు ప్రకారం, ప్రతి రాజ్యములో కేంద్ర ప్రభుత్వంచే పదాభిదానము చేయబడిన డిపోలకు ఆహార ధాన్యముల రవాణాను ఏర్పాటు చేయవలెను;

(డి) కేంద్ర ప్రభుత్వము విహితపరచునట్టి ప్రమాణ నియమములు మరియు రీతి ననుసరించి, రాజ్యం లోపల రవాణా, ఆహార ధాన్యముల నిర్వహణ మరియు చౌక ధరల దుకాణ దారులకు చెల్లించిన ఉపాంతర వ్యయము క్రింద రాజ్య ప్రభుత్వం ఖర్చు చేసిన వ్యయమును భరించడానికి రాజ్య ప్రభుత్వమునకు సహాయాన్ని అందించవలెను; మరియు

(ఇ) వివిధ స్థాయిలలో అవసరమగు ఆధునిక మరియు వైజ్ఞానిక పరమైన పద్ధతిలో నిల్వచేయు సదుపాయములను కల్పించవలెను మరియు నిర్వహించవలెను.

కొన్ని సందర్భములలో కేంద్ర ప్రభుత్వముచే రాజ్య ప్రభుత్వమునకు నిధుల కొరకైన నిబంధనలు.

23. కేంద్ర నిల్వల నుండి రాజ్యమునకు ఆహార ధాన్యములను తక్కువగా సరఫరా చేసిన సందర్భంలో, అధ్యాయం-2 క్రింద బాధ్యతలను నెరవేర్చుటకై తక్కువగ సరఫరా చేసినంత మేరకు కేంద్ర ప్రభుత్వం విహితపరచబడినట్టి రీతిలో రాజ్య ప్రభుత్వమునకు నిధులను సమకూర్చవలెను.

## అధ్యాయము - 9

## ఆహార భద్రతకై రాజ్య ప్రభుత్వ బాధ్యతలు.

ఆహార భద్రతను నిశ్చయ పర్చుటకు పథకములను అమలు పరచుట మరియు పర్యవేక్షించుట.

24. (1) రాజ్య ప్రభుత్వం, తమ రాజ్యంలో లక్షిత లబ్దిదారులకు ఆహార భద్రతను నిశ్చయపర్చుట కొరకైన మరియు తమ స్వంత పథకములు మరియు ప్రతి పథకము కొరకు కేంద్ర ప్రభుత్వంచే జారీ చేయబడిన మార్గదర్శక సూత్రముల ననుసరించి కేంద్ర ప్రభుత్వ వివిధ మంత్రిత్వ శాఖలు మరియు వాటి విభాగముల పథకములను అమలు పరచుటకు మరియు పర్యవేక్షించుటకు బాధ్యత వహించవలెను.

(2) లక్షిత ప్రజా పంపిణీ విధానం క్రింద,-

(ఎ) అనుసూచి - 1లో నిర్దిష్టపరచిన ధరలలో కేంద్ర ప్రభుత్వం రాజ్యంలో నియోగించిన డిపోల నుండి ఆహార ధాన్యములను బట్వాడా చేసుకొని, తన యొక్క అధీకృత ఏజన్సీల ద్వారా కేటాయించబడిన ఆహార ధాన్యములను ప్రతి చౌక ధరల దుకాణం గుమ్మం వద్దకు బట్వాడా చేయుట కొరకు రాజ్యం లోపల కేటాయింపులను నిర్వహించుట; మరియు

(బి) అనుసూచి-1లో నిర్దిష్టపరచిన ధరలకు హక్కు గల వ్యక్తులకు ఆహార ధాన్యములను వాస్తవంగా బట్వాడా చేసేటట్టు లేదా సరఫరా చేసేటట్టు నిశ్చయపర్చుట,-

రాజ్య ప్రభుత్వ కర్తవ్యమై ఉండును.

(3) 4, 5 పరిచ్ఛేదములు మరియు 6వ పరిచ్ఛేదము క్రింద హక్కులకు సంబంధించి ఆహార ధాన్యాల అవశ్యకాలకై పైన పేర్కొనిన పరిచ్ఛేదములలో నిర్దిష్టపరిచినట్లుగా అనుసూచి-1లో నిర్ధిష్టపరచిన ధరలకు, అర్హులైన కుటుంబములకు చెందిన వ్యక్తులకు ఆ హక్కుల లబ్ధులను వాస్తవముగా బట్వాడా చేసేటట్టు చూడడానికి రాజ్యములోని కేంద్ర ప్రభుత్వము పదాభిదానము చేయబడిన డిపోల నుండి ఆహార ధాన్యములను బట్వాడా చేసుకొనుటకు రాజ్య ప్రభుత్వము బాధ్యత వహించవలెను.

(4) అధ్యాయము-2 క్రింద అర్హతగల వ్యక్తులకు ఆహార ధాన్యములు లేదా భోజనములు హక్కు గల పరిమాణములలో సరఫరా చేయలేని సందర్భంలో, 8వ పరిచ్ఛేదములో నిర్ధిష్టపరచిన ఆహార భద్రతా భత్యమును చెల్లించుటకు రాజ్య ప్రభుత్వం బాధ్యత వహించవలెను.

(5) లక్షిత ప్రజా పంపిణీ విధానమును సమర్ధవంతంగా నిర్వహించుటకై ప్రతి రాజ్య ప్రభుత్వము,-

(ఎ) లక్షిత ప్రజా పంపిణీ విధానము మరియు ఇతర ఆహార ఆధారిత సంక్షేమ పథకముల క్రింద అవసరమగు ఆహార ధాన్యములను సమృద్ధిగా నిల్వ చేయవలసి ఉన్నందున, రాజ్య, జిల్లా మరియు బ్లాకు స్థాయిలలో వైజ్ఞానికపరమైన పద్ధతిలో నిల్వ చేయు సదుపాయములను కల్పించవలెను మరియు నిర్వహించ వలెను;

(బి) ఆహార మరియు పౌర సరఫరాల కార్పొరేషన్ల మరియు తదితర ఇతర పదాభిదానము చేయబడిన ఏజెన్సీల సామర్థ్యములను తగిన విధముగా పటిష్టవంతం చేయవలెను;

(సి) ఆయా సమయములందు సవరించినట్లుగా నిత్యావసర సరుకుల చట్టము, 1955 క్రింద చేయబడిన ప్రజా పంపిణీ విధానము (నియంత్రణ) ఉత్తరువు, 2001 యొక్క సంబంధిత నిబంధనల 1955లోని 10వ చట్టము.

ననుసరించి చౌక ధరల దుకాణముల కొరకు సంస్థాగత లైసెన్సింగు ఏర్పాట్లను సమకూర్చవలెను.

## అధ్యాయము - 10
## స్థానిక ప్రాధికార సంస్థల భాద్యతలు.

స్థానిక ప్రాధికార సంస్థచే లక్షిత ప్రజా పంపిణీ విధానమును వారి ప్రాంతములలో అమలు పరచుట.

25. (1) ఈ చట్టమును వారి వారి ప్రాంతములలో తగు విధముగా అమలు చేయుటకై స్థానిక ప్రాధికార సంస్థలు బాధ్యత వహించ వలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1)కి భంగము కలుగకుండా, రాజ్య ప్రభుత్వము, అధిసూచన ద్వారా, లక్షిత ప్రజా పంపిణీ విధానమును అమలు చేయుటకైన అదనపు బాధ్యతలను స్థానిక ప్రాధికార సంస్థకు అప్పగించ వచ్చును.

స్థానిక ప్రాధికార సంస్థ బాధ్యతలు.

26. కేంద్ర ప్రభుత్వ మరియు రాజ్య ప్రభుత్వ మంత్రిత్వ శాఖల మరియు వాటి విభాగముల యొక్క వివిధ పథకములను అమలు చేయడంలో ఈ చట్టపు నిబంధనలను అమలు పరచుటకు సమాయత్తము కావలెను మరియు సంబంధిత రాజ్య ప్రభుత్వములచే, అధిసూచన ద్వారా తనుకు అప్పగించబడినట్టి కర్తవ్యములను మరియు . బాధ్యతలను నిర్వర్తించుటకు స్థానిక ప్రాధికార సంస్థలు బాధ్యత వహించవలెను.

## అధ్యాయము - 11
## పారదర్శకత మరియు జవాబుదారీతనం

లక్షిత ప్రజా పంపిణీ విధానపు రికార్డులను వెల్లడి చేయుట.

27. లక్షిత ప్రజా పంపిణీ విధానపు సంబంధిత రికార్డులన్నింటిని సార్వజనిక పరిధిలో ఉంచవలెను మరియు రాజ్య ప్రభుత్వము విహితపరచునట్టి రీతిలో ప్రజల తనిఖీ నిమిత్తం బహిరంగముగా ఉంచవలెను.

సామాజిక ఆడిటును చేయుట.

28. (1) రాజ్య ప్రభుత్వముచే అధికారమీయబడినట్టి ప్రతి స్థానిక ప్రాధికార సంస్థ లేదా ఏదైనా ఇతర ప్రాధికార సంస్థ లేదా నికాయము, చౌక ధర దుకాణములు, లక్షిత ప్రజా పంపిణీ విధానము మరియు ఇతర సంక్షేమ

పథకముల పనితీరుపై నియత కాలికంగా సామాజిక ఆడిట్లను చేయవలెను లేదా చేయించవలెను మరియు కనుగొన్న విషయాలను రాజ్య ప్రభుత్వము విహితపరచునట్టి రీతిలో ప్రచారము చేయించవలెను మరియు అవసరమగు చర్య తీసుకొనవలెను.

(2) కేంద్ర ప్రభుత్వము, తాను అవసరమని భావించిన యెడల, ఆడిట్లలో అనుభవం కలిగివున్నట్టి స్వతంత్ర ఏజెన్సీల ద్వారా సామాజిక ఆడిటును చేయవలెను లేదా చేయించవలెను.

29. (1) లక్షిత ప్రజా పంపిణీ విధానమును పారదర్శకముగా ఉండునట్లు మరియు తగిన విధముగా పని చేయునట్లు చూచుటకు మరియు అట్టి విధానములోని అధికారుల జవాబు దారీతనము కొరకు, ప్రతి రాజ్య ప్రభుత్వం, ఆయా సమయములందు సవరించబడునట్టి నిత్యావసర సరుకుల చట్టము, 1955 క్రింద చేయబడిన ప్రజా పంపిణీ విధానము (నియంత్రణ) ఉత్తరువు, 2001లో నిర్దిష్టపరచినట్లుగా, స్థానిక ప్రాధికార సంస్థలు, అనుసూచిత కులములు, అనుసూచిత జనజాతులు, మహిళలు మరియు అనాథలు లేదా దివ్యాంగులకు తగిన ప్రాతినిధ్యం ఇస్తూ రాజ్య ప్రభుత్వముచే విహిత పరచబడినట్టి వ్యక్తులతో కూడిన, రాజ్య, జిల్లా, బ్లాకు మరియు చౌక ధర దుకాణ స్థాయిలలో, నిఘా కమిటీలను ఏర్పాటు చేయవలెను.

నిఘా (విజిలెన్స్) కమిటీలను ఏర్పాటు చేయడం.

1955లోని 10వ చట్టము.

(2) నిఘా కమిటీలు ఈ క్రింది కృత్యములను నిర్వర్తించవలెను, అనేవనగా:-

(ఎ) ఈ చట్టము క్రింద పథకములన్నింటిని అమలు చేయుటలో క్రమానుసారంగా పర్యావేక్షించుట;

(బి) ఈ చట్టములోని ఏవైనా నిబంధనల ఉల్లంఘనను వ్రాత పూర్వకముగా జిల్లా వ్యథల నివారణ అధికారికి తెలియజేయుట; మరియు

(సి) తాను కనుగొన్న ఏదైనా అనుచిత కార్యము లేదా నిధుల దుర్వినియోగమును, వ్రాత పూర్వకముగా జిల్లా వ్యథల నివారణ అధికారికి తెలియజేయుట.

## అధ్యాయము – 12

## ఆహార భద్రతా పురోగమనము కొరకు నిబంధనలు

మారుమూల, కొండ మరియు ఆదివాసీ ప్రాంతములలో నివసిస్తున్న ప్రజలకు ఆహార భద్రత.

30. ఈ చట్టములో నిర్దిష్టపరచిన హక్కులను కలుగజేయడం కొరకైన నిబంధనలను మరియు పథకములను అమలు చేయు సమయంలో దుర్బలులైన సమూహములకు, ప్రత్యేకముగా మారుమూల ప్రాంతములలో మరియు ప్రవేశించుటకు కష్టతరమైన ఇతర ప్రాంతములు, కొండ మరియు ఆదివాసీ ప్రాంతములలోని వారి అవసరములను తీర్చడానికైన ఆహార భద్రతపై కేంద్ర ప్రభుత్వము మరియు రాజ్య ప్రభుత్వములు ప్రత్యేక దృష్టిని సారించవలెను.

ఆహారము మరియు పోషకాహార భద్రత పురోగమనముకై చర్యలు.

31. ఆహారము మరియు పోషకాహార భద్రతను పురోగమింపజేయు ప్రయోజనము కొరకు కేంద్ర ప్రభుత్వము మరియు రాజ్య ప్రభుత్వములు మరియు స్థానిక ప్రాధికార సంస్థలు అనుసూచి-3లో నిర్దిష్టపరచబడినట్టి లక్ష్యములను సాధించడానికి క్రమముగా ప్రయత్నించవలెను.

## అధ్యాయము – 13

## వివిధములు

ఇతర సంక్షేమ పథకములు.

32. (1) ఈ చట్టము యొక్క నిబంధనలు, ఇతర ఆహార ఆధారిత సంక్షేమ పథకములను కొనసాగించుట లేదా రూపొందించుట నుండి కేంద్ర ప్రభుత్వమును లేదా రాజ్య ప్రభుత్వమును ఆటంకపరచవు.

(2) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికినీ, రాజ్య ప్రభుత్వము తన స్వంత వనరుల నుండి, ఈ చట్టము క్రింద నిబంధించినట్టి ప్రయోజనములకంటే ఎక్కువ ప్రయోజనముల కొరకు నిబంధించినట్టి ఆహార లేదా పోషకాహార

ప్రణాళికల లేదా పథకములను కొనసాగించ వచ్చును లేదా రూపొందించ వచ్చును.

33. ఏదైనా ఫిర్యాదును లేదా అపీలును నిర్ణయించు సమయములో రాజ్య కమీషనుచే ఎవరైనా ప్రభుత్వ ఉద్యోగి లేదా ప్రాధికారి దోషిగా కనుగొనబడినప్పుడు, సబబైన కారణము లేకుండా జిల్లా వ్యథల నివారణ అధికారిచే సిఫారసు చేయబడిన పరిహారమును కల్పించుటకు విఫలమైనను లేదా బుద్ధి పూర్వకముగ అట్టి సిఫారసును ఉపేక్షించినను, ఐదు వేల రూపాయలకు మించనట్టి జరిమానాకు గురి అగును: జరిమానాలు.

అయితే, ప్రభుత్వోద్యోగి లేదా ప్రజా ప్రాధికారి సందర్భానుసారముగ ఏదైనా అటువంటి జరిమానాను విధించే ముందు విన్నవించుకొనడానికి అతనికి తగిన అవకాశమును ఈయవలెను.

34. (1) 33వ పరిచ్ఛేదము క్రింద జరిమానాను న్యాయ నిర్ణయము చేయు నిమిత్తము, ఎవరైనా సంబంధిత వ్యక్తికి విన్నవించుకొనడానికి తగిన అవకాశమును ఇచ్చిన పిదప విహితపరచబడిన రీతిలో పరిశీలన చేసి ఏదైనా జరిమానాను విధించుట కొరకు రాజ్య కమీషను, ఎవరైనా దాని సభ్యుడికి న్యాయ నిర్ణయ అధికారిగా ప్రాధికారమీయవలెను. న్యాయ నిర్ణయ అధికారము.

(2) న్యాయ నిర్ణయ అధికారి, పరిశీలన చేయునపుడు తన అభిప్రాయములో పరిశీలనకు సంబంధించిన విషయమని భావించిన లేదా పరిశీలనకు ఉపయోగపడునదైన ఏదైనా దస్తావేజును దాఖలు పరచడానికి, కేసు విషయాలలో మరియు పరిస్థితులతో అవగాహనను కలిగియున్న ఎవరైనా వ్యక్తిని సమను చేయుటకు మరియు అతను హాజరగునట్లు చేయుటకు అధికారమును కలిగి ఉండును మరియు అట్టి పరిశీలనపై జిల్లా వ్యథల నివారణ అధికారిచే సిఫారసు చేయబడిన పరిహారమును కల్పించుటలో తగిన కారణము లేకుండా ఆ వ్యక్తి విఫలమైనాడని లేదా అతడు అట్టి సిఫారసును బుద్ధి పూర్వకంగా ఉపేక్షించినాడని ఆయన సంతృప్తి చెందినచో, 33వ

పరిచ్ఛేదము యొక్క నిబంధనల ప్రకారము తాను సబబని భావించినట్టి జరిమానాను విధించవచ్చును.

కేంద్ర ప్రభుత్వము మరియు రాజ్య ప్రభుత్వముచే ప్రత్యాయోజనము చేయుటకు గల అధికారము.

35. (1) కేంద్ర ప్రభుత్వము, అధిసూచన ద్వారా తనచే వినియోగించ బడునట్టి అధికారములను (నియమములను చేయుటకైన అధికారము తప్ప) మరియు అట్టి షరతులకు మరియు పరిమితులకు లోబడి, అట్టి పరిస్థితులలో రాజ్య ప్రభుత్వ లేదా కేంద్ర ప్రభుత్వము క్రింది అధీనములోని అధికారి లేదా అధిసూచనలో నిర్దిష్టపరచినట్టి రాజ్య ప్రభుత్వము కూడా వినియోగించవచ్చునని ఆదేశించవచ్చును.

(2) రాజ్య ప్రభుత్వము, అధిసూచన ద్వారా, తనచే వినియోగించ బడునట్టి అధికారములను (నియమములు చేయుటకైన అధికారము తప్ప) అట్టి షరతులకు మరియు పరిమితులకు లోబడి, అట్టి పరిస్థితులలో అధిసూచనలో నిర్దిష్టపరచబడినట్లు తన అధీనములోని అధికారి కూడా వినియోగించ వచ్చునని ఆదేశించవచ్చును.

చట్టమును అధిగమించు ప్రభావము.

36. తత్సమయమున అమలులోనున్న ఏదైనా ఇతర శాసనము లేదా దానిలోనున్న ఏదైనా అధికార పత్రములో అసంగతంగా ఏమున్నప్పటికినీ, ఈ చట్టములోని నిబంధనలు లేదా దాని క్రింద చేయబడిన పథకములు ప్రభావమును కలిగి ఉండును.

అనుసూచీలను సవరించుటకు అధికారము.

37. (1) కేంద్ర ప్రభుత్వము, అనుసూచి-1ని లేదా అనుసూచి-2ను లేదా అనుసూచి-3ను లేదా అనుసూచి-4ను సవరించుట అవసరమని లేదా ఉపయుక్తమని సంతృప్తి చెందినచో, అధిసూచన ద్వారా అట్లు సవరించవచ్చును మరియు అటు తరువాత అనుసూచి-1ని లేదా అనుసూచి-2ను లేదా అనుసూచి-3ను లేదా సందర్భానుసారముగా అనుసూచి-4ను తదనుసారంగా సవరించినట్లుగా భావించవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద జారీ చేసిన ప్రతి అధిసూచన ప్రతిని, దానిని జారీ చేసిన తరువాత వీలైనంత తొందరగా పార్లమెంటు యొక్క ప్రతి సదనము సమక్షమున ఉంచవలెను.

38. ఈ చట్టము నిబంధనలు సమర్థవంతముగా అమలు చేయుటకై కేంద్ర ప్రభుత్వం, ఆయా సమయములందు తాను అవసరమని భావించినట్టి ఆదేశములను రాజ్య ప్రభుత్వములకు ఈయవచ్చును మరియు ఆ రాజ్య ప్రభుత్వములు అట్టి ఆదేశములను పాటించవలెను. ఆదేశములను ఇచ్చుటకు కేంద్ర ప్రభుత్వమునకు అధికారము.

39. (1) కేంద్ర ప్రభుత్వము, రాజ్య ప్రభుత్వములను సంప్రదించిన మీదట అధిసూచన ద్వారా, ఈ చట్టము యొక్క నిబంధనలను అమలు చేయుటకైన నియమములను చేయవచ్చును. నియమములను చేయుటకు కేంద్ర ప్రభుత్వము అధికారములు.

(2) ప్రత్యేకించియు మరియు పూర్వగామి అధికారము యొక్క సాధారణతకు భంగము కలుగకుండా ఈ క్రింది అన్ని లేక వాటిలో ఏవైనా కొన్ని విషయములకైనట్టి నియమములను చేయవచ్చును, అవేవనగా:-

(ఎ) 4వ పరిచ్ఛేదములోని ఖండము (బి) క్రింద గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులకు ప్రసూతి ప్రయోజనములను కల్పించుట కొరకు వ్యయముల వాటాను పంచుకొనుటలో చేరియున్న పథకము;

(బి) 7వ పరిచ్ఛేదము క్రింద వ్యయముల వాటాను పంచుకొనుటతో సహా పరిచ్ఛేదములు 4, 5 మరియు 6వ పరిచ్ఛేదము క్రింద హక్కుల క్రిందికి వచ్చు పథకములు;

(సి) 8వ పరిచ్ఛేదము క్రింద అర్హులైన వైయుక్తిక వ్యక్తులకు ఆహార భద్రతా భత్యముల మొత్తము చెల్లింపు రీతి మరియు సమయము;

(డి) 12వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2)లోని ఖండము (హెచ్) క్రింద అట్టి ప్రాంతములలో మరియు రీతిలో ఆహార ధాన్యాలకు హక్కు కల్గి ఉన్న వారిని లెక్కించు ఉద్దేశముతో లక్షిత లబ్ధిదారులకు నగదు బదిలీ, భోజన కూపనుల పథకములు లేదా ఇతర పథకములను ప్రవేశపెట్టుట;

(ఇ) 22వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (4)లోని ఖండము (డి) క్రింద ఖర్చులను భరించుటలో రాజ్య ప్రభుత్వములకు సహాయమును అందించుటకైన ప్రమాణ నియమములు మరియు రీతి;

(ఎఫ్) 23వ పరిచ్ఛేదము క్రింద ఆహార ధాన్యాలను తక్కువగా సరఫరా చేసిన సందర్భములో కేంద్ర ప్రభుత్వముచే రాజ్య ప్రభుత్వములకు నిధులనందించు రీతి;

(జి) కేంద్ర ప్రభుత్వముచే ఏ నియమముల ద్వారా నిబంధన చేయబడినదో అట్టి నియమములకు సంబంధించి విహితపరచిన లేదా విహితపరచునట్టి ఏదైనా ఇతర విషయము.

(3) ఈ చట్టము క్రింద కేంద్ర ప్రభుత్వముచే చేయబడిన ప్రతి నియమమును అది చేసిన తరువాత వీలైనంత త్వరలో, పార్లమెంటు సమావేశములోనున్నప్పుడు దాని ప్రతి యొక సదనము సమక్షమున మొత్తము ముప్పై దినముల కాలావధిపాటు ఉంచవలెను. ఆ కాలావధి ఒకే సమావేశములోగాని రెండు లేక అంతకంటే ఎక్కువ అనుక్రమ సమావేశములలో గాని చేరి ఉండవచ్చును. పైన తెలిపిన సమావేశము లేక అనుక్రమ సమావేశములకు అవ్యవహితానంతరము వచ్చు సమావేశము ముగియుటకు ముందు, ఆ నియమములో ఏదైనా మార్పు చేయుటకు నియమము చేయరాదని ఉభయ సదనములు అంగీకరించినట్లయితే, ఆ తరువాత ఆ నియమము అట్లు మార్పు చేసిన రూపములో మాత్రమే ప్రభావము కలిగియుండును లేక సందర్భానుసారము ప్రభావరహితమై ఉండును.

అయితే, అట్టి ఏదైనా మార్పు లేక రద్దు ఆ నియమము క్రింద అంతకు పూర్వము చేసిన దేని శాసన మాన్యతకును భంగము కలిగించదు.

నియమములను చేయుటకు రాజ్య ప్రభుత్వమునకు గల అధికారము.

40. (1) రాజ్య ప్రభుత్వము, అధిసూచన ద్వారా, పూర్వ ప్రచురణ యొక్క నిబంధనకు లోబడి మరియు ఈ చట్టము మరియు కేంద్ర ప్రభుత్వముచే చేయబడిన నియమములకు సంగతంగా ఈ చట్టము యొక్క నిబంధనలను అమలు చేయుటకు నియమములను చేయవచ్చును.

(2) ప్రత్యేకముగా మరియు పూర్వగామి అధికారము యొక్క సాధారణతకు భంగము కలుగకుండా ఈ క్రింది అన్ని లేక వాటిలో ఏవైనా విషయములకైనట్టి నియమములను చేయవచ్చును. అవేవనగా:-

(ఎ) 10వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ప్రాధాన్య కుటుంబాలను గుర్తించుట కొరకైన మార్గదర్శక సూత్రాలు;

(బి) 14వ పరిచ్ఛేదము క్రింద అంతర్గత వ్యథల నివారణ యంత్రాంగము;

(సి) జిల్లా వ్యథల నివారణ అధికారిగా నియమింపబడుటకైన అర్హతలు మరియు 15వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (2) క్రింద దాని అధికారాలు;

(డి) 15వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) క్రింద జిల్లా వ్యథల నివారణ అధికారి యొక్క నియామకపు పద్ధతి మరియు నిబంధనలు మరియు షరతులు;

(ఇ) జిల్లా వ్యథల నివారణ అధికారిచే ఫిర్యాదులను ఆకర్ణించుటకైన మరియు 15వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదములు (5) మరియు (7) క్రింద అపీళ్లు చేయుటకైన రీతి మరియు కాలాపరిమితి;

(ఎఫ్) 16వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (5) క్రింద ఛైర్‌పర్సన్, ఇతర సభ్యులు మరియు రాజ్య కమీషను సభ్య-కార్యదర్శి నియామకపు పద్ధతి మరియు నియామకపు నిబంధనలు మరియు షరతులు, కమీషను సమావేశము కొరకైన ప్రక్రియ మరియు దాని యొక్క అధికారములు;

(జి) 16వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (8) క్రింద రాజ్య కమీషను సిబ్బంది నియామకమునకైన పద్ధతి, వారి జీత భత్యములు మరియు సేవా షరతులు;

(హెచ్) 27వ పరిచ్ఛేదము క్రింద లక్షిత ప్రజా పంపిణీ విధానమునకు సంబంధించిన రికార్డులను సార్వజనిక పరిధిలో ఉంచుట మరియు ప్రజల తనిఖీ కొరకు వీలుగా ఉంచు రీతి;

(ఐ) 28వ పరిచ్ఛేదము క్రింద చౌక ధరల దుకాణముల పనితీరు, లక్షిత ప్రజా పంపిణీ విధానము మరియు ఇతర సంక్షేమ పథకముల సామాజిక ఆడిటు నిర్వహించు రీతి;

(జె) 29వ పరిచ్ఛేదములోని ఉప-పరిచ్ఛేదము (1) క్రింది నిఘా కమిటీల కూర్పు;

(కె) 43వ పరిచ్ఛేదము క్రింద సంస్థా గత యంత్రాంగ ఉపయోగము కొరకు కేంద్ర ప్రభుత్వము లేక రాజ్య ప్రభుత్వముల యొక్క పథకములు లేదా కార్యక్రమములు;

(ఎల్) రాజ్య ప్రభుత్వముచే ఏ నియమముల ద్వారా నిబంధన చేయబడినదో అట్టి నియమములకు సంబంధించి విహితపరచిన లేదా విహితపరచునట్టి ఏదైనా ఇతర విషయము.

(3) ఈ చట్టము క్రింద రాజ్య ప్రభుత్వముచే చేయబడిన లేక జారీ చేయబడిన ప్రతి నియమమును, అధిసూచనను మరియు మార్గదర్శక సూత్రాలను వాటిని చేసిన లేక జారీ చేసిన తరువాత వీలైనంత త్వరలో, రాజ్య శాసనమండలిలో రెండు సదనములు ఉన్నప్పుడు ప్రతి సదనము సమక్షమున మరియు రాజ్య శాసనమండలికి ఒకే సదనము ఉన్నప్పుడు ఆ సదనము సమక్షమున ఉంచవలెను.

41. ఈ చట్టపు ప్రారంభ తేదీ నాటికి అమలులోనున్న పథకములు, మార్గదర్శక సూత్రాలు, ఉత్తరువులు మరియు ఆహార ప్రమాణము, వ్యథల నివారణ యంత్రాంగము, నిఘా కమిటీల అమలును కొనసాగించవలెను మరియు అట్టి పథకములు, మార్గదర్శక సూత్రాలు, ఉత్తర్వులు మరియు ఆహార ప్రమాణము, వ్యథల నివారణ యంత్రాంగము, ఈ చట్టము లేదా దాని క్రింద చేసిన నియమముల క్రింద నిర్దిష్టపరచబడిన లేక అధిసూచించబడినట్టి నిఘా కమిటీలు ఉన్నంత వరకు నిర్వహించవలెను: పథకముల మార్గదర్శక సూత్రాలు మొదలగు వాటి కొరకు తాత్కాలిక నిబంధనలు.

అయితే, సదరు పథకముల, మార్గదర్శక సూత్రాల, ఉత్తరువులు మరియు ఆహార ప్రమాణము, వ్యథల నివారణ యంత్రాంగము క్రింద లేదా నిఘా కమిటీలచే చేయబడిన లేక తీసుకొన్న ఏదైనా చర్యను ఈ చట్టము యొక్క సంబంధిత నిబంధనల క్రింద చేసినట్లుగా లేదా తీసుకొన్నట్లుగా భావించవలెను మరియు చట్టము క్రింద చేయబడిన లేదా తీసుకొన్న ఏదేని చర్యచే రద్దు చేయబడునంత వరకు అమలులో ఉండుట కొనసాగును.

42. (1) ఈ చట్టపు నిబంధనలను అమలు పరచుటలో ఏదైనా ఇబ్బంది, ఉత్పన్నమైనపుడు, కేంద్ర ప్రభుత్వము, అధికారిక రాజపత్రములో ప్రచురించబడిన ఉత్తరువు ద్వారా, ఈ చట్టపు నిబంధనలకు అసంగతముగా లేకుండా ఆ ఇబ్బందిని తొలగించుటకు ఆవశ్యకము లేదా ఉపయుక్తమని భావించునట్టి నిబంధనలను చేయవచ్చును: ఇబ్బందులను తొలగించుటకు అధికారము.

అయితే, ఈ చట్టము ప్రారంభమైన తేదీ నుండి రెండు సంవత్సరములు ముగిసిన తరువాత ఈ పరిచ్ఛేదము క్రింద ఎలాంటి ఉత్తరువును చేయరాదు.

(2) ఈ పరిచ్ఛేదము క్రింద చేసిన ప్రతి ఉత్తరువును దానిని చేసిన తరువాత వీలైనంత తొందరగా పార్లమెంటు ప్రతి సదనము సమక్షమున ఉంచవలెను.

సంస్థాగత యంత్రాంగమును ఇతర ప్రయోజనముల కొరకు ఉపయోగించుట.

43. పరిచ్ఛేదములు 15 మరియు 16ల క్రింద నియమించబడు లేక ఏర్పాటు చేయబడు ప్రాధికారుల సేవలను, రాజ్య ప్రభుత్వము విహితపరచునట్లుగా కేంద్ర ప్రభుత్వము లేక రాజ్య ప్రభుత్వపు ఇతర పథకములను లేక కార్యకలాపములను అమలు చేయుటలో ఉపయోగించు కొనవచ్చును.

అనివార్య పరిస్థితి.

44. ఈ చట్టము క్రింద యుద్ధము, వరదలు, కరువు, అగ్ని, తుపాను లేదా భూకంపముల వలన ఆ వ్యక్తికి క్రమబద్ధంగా ఆహారధాన్యాల లేక భోజనముల సరఫరాపై ప్రభావము చూపునట్టి సందర్భములో తప్ప, ఈ చట్టము క్రింద హక్కు కల్గి ఉన్న ఎవరైనా వ్యక్తి క్లెయిమ్ చేసినపుడు, కేంద్ర ప్రభుత్వము లేక సందర్భానుసారముగా రాజ్య ప్రభుత్వము భాధ్యులగును:

అయితే, కేంద్ర ప్రభుత్వము, ప్రణాళిక కమీషనును సంప్రదించిన మీదట అట్టి వ్యక్తికి ఆహార ధాన్యములు లేదా భోజనములను క్రమబద్ధంగా సరఫరా చేయవలసియున్న అవసరము ఏదేని అట్టి పరిస్థితుల ప్రభావము వలన ఏర్పడినదా లేదా ఏర్పడలేదా అనుదానిని ప్రఖ్యానించవచ్చును.

రద్దు మరియు వ్యావృత్తులు.

45. (1) జాతీయ ఆహార భద్రత అధ్యాదేశము, 2013ను ఇందుమూలముగా రద్దు చేయడమైనది.

2013లోని 7వ అధ్యాదేశము.

(2) ఏమియున్నప్పటికినీ అట్టి రద్దు వలన,–

(ఎ) అర్హులైన ఎవరేని కుటుంబములను గుర్తించుటకు చేసిన లేక తీసుకొనిన ఏదైనా చర్య; లేక

(బి) ఆర్జించిన, ప్రాప్తించిన లేదా భరించిన ఏదైనా హక్కు, హక్కుభుక్తము, విశేషాధికారము, బాధ్యత లేక దాయిత్వము; లేదా

(సి) రూపొందించిన ఏవేని మార్గదర్శక సూత్రాలు లేదా జారీ చేసిన ఆదేశములు; లేదా

(డి) పైన పేర్కొనబడినట్టి హక్కు, హక్కుభుక్తము, విశేషాధికారము, బాధ్యత లేదా దాయిత్వము విషయమునకు సంబంధించి ఏదైనా దర్యాప్తు, పరిశీలన లేదా ప్రారంభించిన, నిర్వహించిన లేదా కొనసాగించిన ఏదైనా ఇతర శాసనిక ప్రొసీడింగు; లేదా

(ఇ) ఏదైనా అపరాధమునకు సంబంధించి విధించిన ఏదైనా జరిమానా,

సదరు అధ్యాదేశము క్రింద చేయబడిన, తీసుకొన్న, చేసిన, ఆర్జించిన, ప్రాప్తించిన, భరించిన, రూపొందించిన, జారీ చేసిన, ప్రారంభించిన, నిర్వహించిన, కొనసాగించిన లేదా విధించుటను ఈ చట్టము యొక్క సంబంధిత నిబంధనల క్రింద చేయబడినట్లుగా భావించవలెను.

## అనుసూచి-1

## (పరిచ్ఛేదములు 3(1), 22(1), (3) మరియు 24(2), (3)లను చూడుము)

## లక్షిత ప్రజా పంపిణీ విధానం క్రింద సబ్సిడీ ధరలు

ఈ చట్టపు ప్రారంభ తేదీ నుండి మూడు సంవత్సరముల కాలావధి వరకు 3వ పరిచ్ఛేదము క్రింద ఆహారధాన్యాలకు హక్కు కలిగిన కుటుంబం బియ్యము కిలో గ్రాము 3/- రూపాయలకు, గోధుమలు కిలో గ్రాము 2/- రూపాయలకు మరియు ముతక ధాన్యములు కిలో గ్రాము 1/- రూపాయికి మించనట్టి సబ్సిడీ ధర చొప్పున మరియు ఆ తరువాత ఆయా సమయములందు కేంద్ర ప్రభుత్వముచే నిర్ణయించబడినట్టి ధరకు మించకుండా,-

(i) గోధుమల మరియు ముతక ధాన్యాలకైన కనీస మద్దతు ధర; మరియు

(ii) సందర్భానుసారముగా బియ్యము కొరకు ఉత్పాదిత కనీస మద్దతు ధరకు మించకుండా ఆహార ధాన్యములను పొందుటకు హక్కును కలిగి ఉందురు.

## అనుసూచి - 2

### (పరిచ్ఛేదములు 4(ఎ), 5(1) మరియు 6లను చూడుము)

### పోషక ఆహార ప్రమాణములు

**పోషక ఆహార ప్రమాణము:** 6 మాసముల నుండి 3 సంవత్సరముల వయోవర్గం, 3 సంవత్సరముల నుండి 6 సంవత్సరముల వయోవర్గంలోని పిల్లలకు మరియు గర్భిణీ స్త్రీలకు, మరియు పాలిచ్చే తల్లులకు అవసరమైన పోషక ఆహార ప్రమాణములు లేదా మధ్యాహ్న భోజన పథకము క్రింద ప్రాథమిక మరియు ప్రాథమికోన్నత తరగతులలోని పిల్లల కొరకైన సమగ్ర శిశు అభివృద్ధి సేవల పథకము మరియు పోషక ఆహార ప్రమాణములననుసరించి ఇంటికి తీసుకెళ్ళ రేషను లేక వేడిగా వండిన పౌష్టిక భోజనము యొక్క పోషక ఆహార ప్రమాణములు ఈ క్రింది విధంగా ఉండవలెను:

| వరుస సంఖ్య | శ్రేణి | భోజన రకము | కేలరీలు (కిలో కేలరీలు) | మాంస కృత్తులు (గ్రాములలో) |
|---|---|---|---|---|
| (1) | (2) | (3) | (4) | (5) |
| 1. | పిల్లలు (6 మాసముల నుండి 3 సంవత్సరములు) | ఇంటికి తీసుకొని వెళ్ళు రేషను | 500 | 12-15 |
| 2. | పిల్లలు (3 నుండి 6 సంవత్సరములు) | ఉదయ అల్పాహారము మరియు వేడిగా వండిన భోజనము | 500 | 12-15 |

| | | | | |
|---|---|---|---|---|
| 3. | పోషకాహార లోపమున్న పిల్లలు (6 మాసముల నుండి 6 సంవత్సరములు) | ఇంటికి తీసుకొని వెళ్ళు రేషను | 800 | 20-25 |
| 4. | దిగువ ప్రాథమిక తరగతులు | వేడిగా వండిన భోజనము | 450 | 12 |
| 5. | ప్రాథమికోన్నత తరగతులు | వేడిగా వండిన భోజనము | 700 | 20 |
| 6. | గర్భిణీ స్త్రీలు మరియు పాలిచ్చే తల్లులు | ఇంటికి తీసుకొని వెళ్ళు రేషను | 600 | 18-20 |

## అనుసూచి - 3
## (31వ పరిచ్ఛేదమును చూడుము)
## ఆహార భద్రత పురోగమనము కొరకు నిబంధనలు

(1) వ్యవసాయ పునరుత్తేజమునకైన,-

(ఎ) సన్నకారు మరియు మధ్యకారు రైతుల హితములను భద్రపరచుటకైన చర్యల ద్వారా వ్యవసాయిక సంస్కరణలు;

(బి) పరిశోధన మరియు అభివృద్ధి, విస్తరణ సేవలు, సూక్ష్మ మరియు చిన్న తరహా నీటి పారుదల మరియు ఉత్పాదన మరియు ఉత్పత్తిని పెంచుటకైన అధికారముతో సహా వ్యవసాయములో పెట్టుబడులను పెంచుట;

(సి) ప్రతిఫలమిచ్చు ధరలు, ఆవశ్యకాలు, జమ, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, పంట బీమా మొదలగు ప్రవేశ సౌలభ్య మార్గముల ద్వారా రైతులకు జీవానాధార భద్రతను చేకూర్చుట;

(డి) ఆహార ఉత్పత్తి నుండి అనధికారికంగా భూమిని మరియు నీటిని మళ్లించుటను నిషేధించుట:

(2) సేకరణ, నిల్వ మరియు జోక్యము చేసుకొనుటకు సంబంధించిన ఉద్యమము-

(ఎ) ముతక ధాన్యముల సేకరణతో సహా వికేంద్రీకృత సేకరణను ప్రోత్సాహించుట;

(బి) సేకరణ పనులను భౌగోళికంగా వివిధముగా మళ్లించుట;

(సి) తగినంత వికేంద్రీకృత ఆధునిక మరియు వైజ్ఞానిక నిల్వను బలోపేతము చేయుట;

(డి) మిగులు ప్రాంతముల నుండి వినియోగించు ప్రాంతాలకు ఆహారధాన్యాలను పంపడానికి వీలు కల్పించుటకై రైలు మార్గాలను సమర్థవంతంగా విస్తరించడముతో సహా ఈ ప్రయోజనము కొరకు తగినంత సంఖ్యలో భోగీలను (రేక్స్) ఏర్పాటు చేయుట మరియు ఆహార ధాన్యాల రవాణాకు అత్యంత ప్రాధాన్యమును ఇచ్చుట;

(3) ఇతరములు: ప్రవేశ సౌలభ్యము కొరకు–

(ఎ) సురక్షిత మరియు తగినంత త్రాగునీరు మరియు పారిశుధ్యమును;

(బి) ఆరోగ్య సంరక్షణను;

(సి) యుక్తవయస్సు ప్రాయములోని బాలికలకు పోషకాహార, ఆరోగ్య మరియు విద్యాపరమైన మద్దతును;

(డి) వయోవృద్ధ పౌరులకు, దివ్యాంగులకు మరియు ఒంటరి మహిళలకు తగిన పింఛన్లు కల్పించవలెను.

## అనుసూచి - 4

(3 (1)వ పరిచ్ఛేదమును చూడుము)

రాజ్యముల వారీగా ఆహారధాన్యముల కేటాయింపు.

| వరుస సంఖ్య | రాజ్యము పేరు | పరిమాణము (లక్షల టన్నులలో) |
|---|---|---|
| (1) | (2) | (3) |
| 1. | ఆంధ్రప్రదేశ్ | 32.10 |
| 2. | అరుణాచల్ ప్రదేశ్ | 0.89 |
| 3. | అస్సామ్ | 16.95 |
| 4. | బీహార్ | 55.27 |
| 5. | ఛత్తీస్‌ఘర్ | 12.91 |
| 6. | ఢిల్లీ | 5.73 |
| 7. | గోవా | 0.59 |
| 8. | గుజరాత్ | 23.95 |
| 9. | హర్యానా | 7.95 |
| 10. | హిమాచల్ ప్రదేశ్ | 5.08 |
| 11. | జమ్ము మరియు కాశ్మీర్ | 7.51 |
| 12. | జార్ఖండ్ | 16.96 |
| 13. | కర్నాటక | 25.56 |
| 14. | కేరళ | 14.25 |
| 15. | మధ్యప్రదేశ్ | 34.68 |
| 16. | మహారాష్ట్ర | 45.02 |

| | | |
|---|---|---|
| 17. | మణిపూర్ | 1.51 |
| 18. | మేఘాలయ | 1.76 |
| 19. | మిజోరమ్ | 0.66 |
| 20. | నాగాలాండ్ | 1.38 |
| 21. | ఒడిషా | 21.09 |
| 22. | పంజాబ్ | 8.70 |
| 23. | రాజస్థాన్ | 27.92 |
| 24. | సిక్కిమ్ | 0.44 |
| 25. | తమిళనాడు | 36.78 |
| 26. | త్రిపుర | 2.71 |
| 27. | ఉత్తరప్రదేశ్ | 96.15 |
| 28. | ఉత్తరాఖండ్ | 5.03 |
| 29. | పశ్చిమ బెంగాల్ | 38.49 |
| 30. | అండమాన్ మరియు నికోబార్ దీవులు | 0.16 |
| 31. | ఛండీఘర్ | 0.31 |
| 32. | దాద్రా మరియు నగర్‌హవేలి | 0.15 |
| 33. | డామన్ మరియు డయ్యు | 0.07 |
| 34. | లక్షద్వీప్ | 0.05 |
| 35. | పుదుచ్చేరి | 0.50 |
| | మొత్తము | 549.26 |

Printed and Published by the Commissioner of Printing, Government of Telangana at Government Central Press, Chanchalguda, Hyderabad.